

సింగారం చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

# బస్సులను పునరుద్ధరించాలి

- కోటకొండ రూట్లో విద్యార్థుల నానా అవస్థలు
- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాస్తారోకో

నారాయణపేటరూరల్, జూలై 26 : మండలంలోని కోటకొండ రూట్లో నిలిపివేసిన బస్సులను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సింగారం చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ రోడ్డు పనుల పేరుతో చాలా రోజులుగా కోటకొండ, అభంగాపూర్, బండగొండ, తిర్మలాపూర్, భూనీడ్ గ్రామాలకు బస్సు సౌకర్యం నిలిపివేయడంతో జిల్లా కేంద్రానికి విద్యను అభ్యసించడానికి వచ్చే విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రవాణా సౌకర్యం సరిగా లేక పోవడంతో బాలికలను వారి తల్లిదండ్రులు చదువు మాన్పించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంలో డీఎంకు అనేకసార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందించడం లేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న డిపో ఇన్‌చార్జి మేనేజర్ అలివేలు రాస్తారోకో వద్దకు చేరుకొని సోమవారం నుంచి బస్సులను పునరుద్ధరిస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు విరమించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సలీం, సహాయ కార్యదర్శి వెంకటేశ్, మహేశ్, సురేశ్, విఠల్‌పాల్, లక్ష్మణ్, మోహన్, అనురాధ, రేణుక, నందిని, గీత, భూమిక, భవాని, దీప ఉన్నారు.

# ముసుగులు ధరించి చోరీ

- నగల దుకాణంలో పది కిలోల వెండి, రెండు తులాల బంగారు అపహరణ

బాలానగర్, జూలై 26 : బాలానగర్ మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. ముసుగులు ధరించిన గుర్తు తెలియని నలుగురు దొంగలు స్థానిక రైల్వేస్టేషన్ మార్గంలోని ఓ నగల దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. రాత్రి రెండు గంటల సమయంలో గుర్తు తెలియని నలుగురు దొంగలు కేశా రాం చౌదరికి చెందిన నగల దుకాణంలో చోరీ చేసి సుమారు 10 కిలోల వెండి సామగ్రి, రెండు తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ కిరాణా దుకాణం యజమానికి చెందిన వ్యాన్‌ను దొంగిలించిన దొంగలు నగల దుకాణం ఎదుట వారు ఎవరికీ కనిపించకూదని వ్యాన్‌ను అడ్డుగా నిలిపారు. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై సర్వీసు వైరును తెంపి కట్టర్‌తో దుకాణానికి చెందిన రెండు షెటర్లను కట్ చేశారు. అనంతరం లోనికి ప్రవేశించిన దొంగలు దుకాణంలోని సుమారు 10కిలోల వెండి సామగ్రిని, రెండు తులాల బంగారు నగలతో దొంగిలించిన వ్యాన్‌లో కర్నూలు వైపు వెళ్తూ రాజాపూర్ సమీపంలోని దాబా వద్ద వ్యాన్‌ను వదిలిపెట్టి పారిపోయారు. శుక్రవారం ఉదయం దుకాణం షెటర్లు తెరిచి ఉండడం గమనించిన యజమాని కేశారాం చౌదరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న ఎస్సై తిరుపాజీ ప్రాథమిక దర్యాప్తు నిర్వహించారు. క్లూస్‌టీం పోలీసులు దర్యాప్తు చేశారు. ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమెరా పుటేజీలు, క్లూస్‌టీం ఆధారాలతో కేసును దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.




ధ్వంసమైన బంగారు దుకాణం షెట్టర్లు



కోయిల్‌సాగర్ కుడి కాల్వకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి

# చివరి ఆయకట్టుకూ సాగునీరు

- దేవరకద్ర, నారాయణపేట ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి
- కోయిల్‌సాగర్ కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదల

దేవరకద్ర, జూలై 26 : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తామని దేవరకద్ర, నారాయణపేట ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల నుంచి వారు ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎడమ కాల్వ దేవరకద్ర నియోజకవర్గం పరిధిలో వస్తుందని, కుడి కాల్వ నారాయణపేట జిల్లా పరిధిలోకి వస్తుందన్నారు. ఆయకట్టు కింద ఉన్న దేవరకద్ర, చిన్నచింతకుంట, మరికల్, ధన్వాడ మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సాగు నీటిని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ప్రకృతి సిద్ధంగా కొండల నడుమ ఆహ్లాదకరమైన, అద్భుతమైన వాతావరణంలో ఉందన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టును పర్యాటక స్థలంగా మారుస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్, నాయకులు అంజిరెడ్డి, అరవింద్‌కుమార్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, వెంకటేశ్, భరత్, గోపాల్ తదితరులు ఉన్నారు.

**సరళాసాగర్ నుంచి నీటి విడుదల**

మదనాపురం, జూలై 26 : సరళాసాగర్ ఎడమ కాల్వ ద్వారా సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నీటి తీరవా సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి మదనాపురం, కొత్తకోట మండలంలోని 10 గ్రామాల రైతులకు ఎడమ కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే మొట్టమొదటి ఆటోమెటిక్ సైఫన్ సిస్టం కలిగిన సరళాసాగర్‌ను టూరిజం స్పాట్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. సరళాసాగర్, నెల్విడి, కురుమూర్తిరాయ లిఫ్టులకు సంబంధించిన మోటర్లు, పైప్‌లైన్ల మరమ్మతులు చేయించి యాసంగి సీజన్ వరకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, మండల నాయకులు పాల్గొన్నారు.

# గుడిబండ ఎయిర్‌పోర్టుకు స్థల నివేదిక ఇవ్వాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి ఆదేశాలు

మూసాపేట(అడ్డాకుల), జూలై 26 : అడ్డాకుల మండలంలోని గుడిబండ గ్రామంలో మినీఎయిర్ పోర్టు స్థల నివేదికలు ఇవ్వాలని అడ్డాకుల తాసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్‌ను కలెక్టర్ విజయేందిరబోయి ఆదేశించారు. శుక్రవారం అడ్డాకుల మండల పర్యటనకు వెళ్లిన కలెక్టర్ ప్రత్యేకంగా తాసీల్దార్‌తో మాట్లాడారు. గుడిబండ గ్రామంలో గతంలో మినీ ఎయిర్ పోర్టు కోసం పరిశీలించిన భూమిని పూర్తి స్థాయిలో పరిశీలించి ప్రత్యేకంగా నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. కానీ ఆ స్థలం ఎందుకోసం మళ్లీ పరిశీలిస్తున్న విషయం మాత్రం అధికారులు గోప్యంగా ఉంచారు. అయితే గతంలో బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఆరు మినీ ఎయిర్‌పోర్టులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో అందులో ఒకటి మహబూబ్‌నగర్‌కు మంజూరు అయినట్లు ప్రభుత్వ అధికారులు దేవరకద్ర నియోజకవర్గంలో అడ్డాకుల మండలంలోని గుడిబండ గ్రామంలో, మూసాపేట మండలంలోని తుంకినీపూర్, వేముల గ్రామ శివారులో, దేవరకద్ర మండలంలో, భూత్పూర్ మండలంలో స్థల పరిశీలన చేశారు. అయితే అందులో గుడిబండ గ్రామంలో ఎక్కువగా ప్రభుత్వ భూమి ఉన్నట్లు ప్రచారం జరిగింది. అక్కడికి విమానయానశాఖ అధికారులు కూడా వచ్చి సందర్శించారు. దీంతో నాడు అడ్డాకుల మండలంతోపాటు గుడిబండ గ్రామం రాష్ట్ర స్థాయిలో ఒక వెలుగు వెలిగింది. రియల్ ఎస్టేట్ రంగంలో కూడా అడ్డాకుల మండలానికి ఒక ఊపు తీసుకొచ్చింది. గుడిబండ గ్రామంలోని 118 సర్వే నెంబరులో 70 ఎకరాలతోపాటు మరో నెంబరులో కూడా ప్రభుత్వ భూమి ఉన్నట్లు అప్పటి అధికారులు వెల్లడించారు. కానీ మినీ ఎయిర్ పోర్టు నిర్మాణం మహబూబ్‌నగర్ జిల్లాకు కలగానే మిగిలిందని చెప్పుకోవాలి. అయితే మళ్లీ కలెక్టర్ విజయేందిర బోయి గుడిబండ గ్రామంలోని ఆ స్థలంపై ఆరా తీయడం వెనుక అసలు రహస్యం ఏమిటో తెలియాల్సి ఉన్నది.

# రఘుపతిపేట బ్రిడ్జి పనులను ప్రారంభించాలి



ధర్నా చేస్తున్న ఆయా సంఘాల నాయకులు

కల్వకుర్తి రూరల్, జూలై 26 : రఘుపతిపేట గ్రామ సమీపంలోని దుందుభీ వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కల్వకుర్తి మండలం రఘుపతిపేట ప్రధాన రహదారిపై సీపీఎం, ఆయా సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిడ్జి మంజూరై ఏండ్లు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదన్నారు. వానకాలంలో నది ఉధృతంగా ప్రవహించడంతో కల్వకుర్తి, తెల్కపల్లి మండలాలకు రాకపోకలు నిలిచిపోతాయన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని పనులను వేగంగా ప్రారంభింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆంజనేయులు, బాల్‌రెడ్డి, పరశురాములు, అశోక్, లక్ష్మయ్య, రఘుపతిపేట గ్రామస్తులు అంజయ్యగౌడ్, భీమయ్య, మల్లేశ్, ఇదమయ్య, శంకర్, శేఖర్ తదితరులు ఉన్నారు.



ఊట్కూరు పెద్ద చెరువు

# కొడంగల్ లిఫ్ట్‌కు మోక్షమెప్పుడో?

- బడ్జెట్‌లో పేట–కొడంగల్ లిఫ్ట్‌కు మంగళం
- పద్దులో నయాపైసా ఇవ్వని ప్రభుత్వం
- రైతుల ఆశలపై నీళ్లు చల్లిన రేవంత్ సర్కార్
- సొంత జిల్లాపై ముఖ్యమంత్రి కపట ప్రేమ
- అధికారంలోకి వచ్చిన వెంటనే హడావుడి
- ఎనిమిది నెలలుగా పట్టించుకోని వైనం

మహబూబ్‌నగర్, జూలై 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ సర్కార్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొడంగల్–నారాయణపేట ఎత్తిపోతల పథకం ఊసే ఎత్తలేదు. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన ఎత్తిపోతల పథకానికి బడ్జెట్‌లో కేటాయింపు జరుపకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇదంతా పొలిటికల్ స్టంట్ అని బీఆర్‌ఎస్ నేతలు ధ్వజమెత్తుతున్నారు. సొంత జిల్లాపై సీఎం కపట ప్రేమను చూపిస్తున్నారని మండిపడుతున్నారు. వెనుకబడిన నారాయణపేట జిల్లాలో ఈ ఎత్తిపోతల పూర్తయితే సాగునీరు, తాగునీటికి ఢోకా ఉండదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై రెండు నాల్కల ధోరణి వ్యవహరిస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

***కొడంగల్ -నారాయణపేట ఎత్తిపోతల స్వరూపం..***

కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో భీమా ఎత్తిపోతల పథకంలో భాగమైన భూత్పూరు జలాశయం నుంచి నాలుగు విడుతల్లో కానుకుర్తి వరకూ నీళ్లు ఎత్తిపోసి అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా దౌల్తాబాద్, కొడంగల్ మీదుగా బొంరాస్‌పేట వరకూ చెరువులు నింపి మొత్తం లక్ష ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. 2014లో అప్పటి ప్రభుత్వం మొదటి దశలో రూ.133 కోట్ల 50లక్షలతో పరిపాలన అనుమతులిస్తూ ఉత్వర్తులు జారీ చేసింది. ఇందులో రూ.3.36 కోట్లు ప్రాథమిక సర్వే కోసం, రూ.130.50 కోట్లు భూసేకరణ కోసం కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వులను అప్పటి గవర్నర్ 2014 మే 23న జీవో నెంబర్– 69 ద్వారా జారీ చేశారు. మొదట్లో పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని జూరాల వెనుకభాగం జలాల నుంచి ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ మేరకు నర్వ మండలం ఎల్లంపల్లి నుంచి నీటిని తోడుకొని అక్కడి నుంచి కోయిల్‌కొండ వద్ద జలాశయం నిర్మించి, తిరిగి అక్కడి నుంచి నారాయణపేట – కొడంగల్ ప్రాంతాలకు నీటిని తరలించాలని అంచనా వేశారు. ఈ డిజైన్‌లో చాలా గ్రామాలు ముంపునకు గురవుతాయని భావించి మొదట అనుకున్న డిజైన్‌ను మార్చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని చేపడతామని ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.3,556 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పథకానికి ఈ ఏడాది ఫిబ్రవరిలో సీఎం రేవంత్‌రెడ్డి లిఫ్టు పనులకు శంకుస్థాపన చేశారు. దీనికి భీమా పథకంలో భాగంగా నిర్మించిన భూత్పూర్ జలాశయం నుంచే నీటిని తరలించనున్నారు. మొత్తం నాలుగు దశల్లో కృష్ణా జలాలను ఎత్తిపోయడం ద్వారా ఏడు టీఎంసీలను లక్ష ఎకరాలకు ఇవ్వాలని భావించారు. దీని వల్ల భూసేకరణ సమస్యలు వస్తాయని గుర్తించిన ప్రభుత్వం మూడు దశల్లోనే చేపట్టాలని పైగా భూగర్భ సొరంగాల స్థానంలో ప్రెషర్ మెయిన్ నిర్మించాలని నిర్ణయించారు. మొత్తం 10చెరువులకు నీటిని తరలించాల్సి ఉండగా సామర్థ్యాన్ని 0.9 టీఎంసీల నుంచి 2.1 టీఎంసీకి పెంచాలని మొదట్లో నిర్ణయించారు. తాజాగా 3.6 టీఎంసీల నిల్వకు వీలుగా జలాశయాలను సిద్ధం చేసేలా అంచనా వేస్తున్నారు.

***కోయిల్‌సాగర్‌కు ఈ పథకానికి లింక్ ఏంటి?***

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల ప్రాజెక్టు ఎగువ నుంచి కృష్ణానది నారాయణపేట జిల్లాలో ప్రవహిస్తుంది. కర్ణాటక, తెలంగాణ సరిహద్దులో మొదలుకొని జూరాల బ్యాక్ వాటర్ వరకు 60నుంచి 70కిలోమీటర్ల మేర ఈ జిల్లాలో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. అయితే ప్రస్తుతం ఈ పథకం కోసం కృష్ణా జలాలను నర్వ మండలం ఎల్లంపల్లి నుంచి తరలించాలని భావిస్తున్నారు. అయితే ఇక్కడి నుంచే కోయిల్‌సాగర్‌కు నీటిని మళ్లిస్తున్నారు. ఇదే పథకానికి ఇక్కడి నుంచి లింకు ఇవ్వడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. ఎల్లంపల్లికి సమీపంలోనే జూరాల బ్యాక్ వాటర్ నుంచి భీమా ప్రాజెక్టుకు నీటిని మళ్లిస్తున్నారు. ప్రస్తుతం ఎల్లంపల్లి నుంచి నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకానికి లింకు ఏర్పాటు ఏ విధంగా చేస్తారో అర్థం కాని ప్రశ్నగా మారింది. మొత్తంపైన కోయిల్‌సాగర్ ఆయకట్టుకు నీళ్లు మళ్లింపు దీని వల్ల ఎఫెక్ట్ అవుతుందని ప్రజలు భావిస్తున్నారు.

ఇప్పటికే వేల క్యూసెక్కుల నీళ్లు శ్రీశైలం వైపు పరుగులు పెడుతున్నా కోయిల్‌సాగర్‌కు అనుకున్న స్థాయిలో నీటిని మళ్లించలేకపోతున్నారు. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకానికి కూడా ఇదే పరిస్థితి రావచ్చని ఆందోళన వ్యక్తమవుతుంది.

### ఇదంతా పొలిటికల్ డ్రామా..



నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం చేపట్టడం కంటే పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని ఎక్స్‌టెన్షన్ చేయడం మేలని గతంలోనే సాగునీటి రంగ నిపుణులు తేల్చిచెప్పారు. కరివెన, ఉదండాపూర్ రిజర్వాయర్ల నుంచి నీటిని ఇటు నారాయణపేట నియోజకవర్గానికి అటు కొడంగల్ నియోజకవర్గానికి తరలించుకునే అవకాశం ఉంది. కేసీఆర్ ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతల పథకానికి అంకురార్పణ చేసి నారాయణపేట–కొడంగల్ ప్రాంతానికి కూడా సాగునీరు అందించేందుకు ఇందులో డిజైన్ చేశారు. తక్కువ ఖర్చుతో కాల్వల నిర్మాణానికి పూనుకోవాల్సిన సర్కారు ఆచరణ సాధ్యం కాని కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని మళ్లీ తెర మీదికి తీసుకొచ్చి పొలిటికల్ డ్రామా ఆడుతున్నది.

*- చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మక్తల్*

# క్షణక్షణం.. భయం భయం!

- శిథిలావస్థకు చేరుకున్న తర్నికల్ ప్రాథమిక పాఠశాల
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్న విద్యార్థులు
- అగమ్యగోచరంగా 66 మంది విద్యార్థుల భవిత
- అసంపూర్తిగా మన ఊరు–మన బడి భవన నిర్మాణం
- బిల్లు చెల్లించలేదని వంటగదిని అప్పగించని కాంట్రాక్టర్
- ప్రభుత్వంపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం



అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు

కల్వకుర్తి, జూలై 26 : వారం పది రోజులుగా కురుస్తున్న ముసురువర్షాలకు పైకప్పుతో పాటు, గోడలకు నీళ్లింకాయి. ఏ గోడ ముట్టుకున్నా తడి చేతులకు అంటుతుంది. పైకప్పు నుంచి వర్షం నీరు ఊరుతున్నది. ముందే పూర్తిగా శిథిలావస్థకు చెందిన పాఠశాల భవనం ముసురు వర్షాలకు మరింత దారుణంగా తయారైంది. సదరు పాఠశాల పైకప్పు కింద 66 మంది చిన్నారులు, నలుగురు ఉపాధ్యాయులు క్షణక్షణం భయం భయంగా కాలం వెల్లదీస్తున్నారు.

కల్వకుర్తి మండలం తర్నికల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు 66 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గతేడాది వరకు ఇక్కడ దాదాపు 150 మంది చదువుకున్నారు. పాఠశాల శిథిలావస్థకు చేరుకోవడం, పైకప్పు ఊడి పడిపోతుండడంతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు భయభ్రాంతులకులోనై తమ పిల్లలను కల్వకుర్తిలోని ప్రైవేట్ పాఠశాలలకు పంపించారు. ఆర్థిక స్థోమత తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు భగవంతుడిపై భారం వేసి తమ పిల్లలను గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు పంపుతున్నారు. అసలే పైకప్పు ఊడిపోయి శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనం ముసురు వర్షాలతో మరింత దెబ్బతిన్నది. పాఠశాలలోని అన్ని గదుల గోడలకు వర్షం నీరు దిగి గోడలన్నీ తడిగా మారాయి. ఇదివరకే ఊడిపోయిన పైకప్పు పెచ్చుల నుంచి వర్షం నీరు కారుతున్నది. పైకప్పు కూడా పూర్తిగా తడిచిపోవడంతో ఎప్పుడు కూలుతుందోనన్న భయంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటున్నారు. ప్రతి గదిలో ఓ మూలకు విద్యార్థులను కూర్చోబెట్టుకొని వారికి పాఠాలు చెబుతున్నారు. తరగతిలోకి వెళ్తే చాలు తడిసిన గదుల ముక్క వాసన. గోడల నిండా మరకలతో దెయ్యాల కొంపను తలపిస్తున్నది.

***పాఠశాలకు కొత్త భవనం నిర్మించేందుకు..***

శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాల స్థానంలో కొత్త భవనం నిర్మించేందుకు మన ఊరు– మన బడి పథకం కింద కేసీఆర్ ప్రభుత్వం రూ.69 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. పైకప్పు(స్లాబ్) వేసే సమయంలో ఎన్నికలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం వచ్చింది. అంతవరకు చేసిన పనులకు డబ్బులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశాడు. పనులు ఆగిపోవడంతో సదరు నిర్మాణ భవనం చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి విషజీవులకు నిలయంగా మారింది.


కేసీఆర్ ప్రభుత్వం విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి వంట గది, డైనింగ్ హాల్‌కు రూ.13 లక్షలు కేటాయించగా కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశాడు. ప్రభుత్వం వంట గది నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.4లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం మారడంతో నిధులు ఆగిపోయాయి. పెండింగ్ బిల్లు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టర్ వంట గదిని పాఠశాలకు అప్పగించలేదు. దీంతో విద్యార్థులు మధ్నాహ్న భోజనాన్ని చెట్ల కింద కూర్చొని తినాల్సిన పరిస్థితి ఏర్పడింది.


***ప్రభుత్వ తీరుపై గ్రామస్తుల ఆగ్రహం..***

పాఠశాల శిథిలావస్థకు చేరుకున్నా.. ఏ అధికారి, ఏ ప్రజాప్రతినిధి కూడా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. పాఠశాల నిర్మాణాల్లో కూడా రాజకీయాలేమిటని మండిపడుతున్నారు. అసంపూర్తిగా పాఠశాల భవన నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ముసురు వర్షాలు కురుస్తుండటంతో పిల్లలను బడికి పంపాలంటే భయం వేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు లాభం వచ్చే పనులకు నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుంటుందని, పాఠశాలల నిర్మాణం వల్ల ప్రభుత్వానికి లాభం రాదని ఉద్దేశంతోనే నిధులు ఇవ్వలేరేమో అన్న అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ఏదైనా ప్రమాదం జరిగితే ఈ ప్రాంత ఎమ్మెల్యే, పక్క ఊరికి చెందిన సీఎం బాధ్యత వహించాల్సి వస్తుందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.



పాఠశాలకు అప్పగించని వంటగది, డైనింగ్ హాల్





స్టాఫ్‌రూంలోనే విద్యార్థులకు బోధన (ఈ గది కూడా తడిసింది), కూలిపోవడంతో వాడకుండా వదిలేసిన తరగతి గది

### కొత్త భవనం ఈ పాటికి పూర్తయ్యేది..



నిధులు సక్రమంగా ఇస్తే ఈ పాటికి మన ఊరు–మన బడి పథకంలో భవనం పూర్తయ్యేది. కొత్త భవనంలోనే విద్యార్థులు చక్కగా చదువుకునే వారు. విద్యార్థుల సంఖ్య 150 అలాగే ఉండేది. ప్రభుత్వం మారడంతో నిధులు నిలిచిపోయాయి. పనులు ఆగిపోయాయి. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రసుత్తం పాఠశాల భవనం చూస్తే భయమేస్తుంది. ఎప్పుడు పడిపోతుందోనని భయపడుతున్నాం. ప్రభుత్వం రాజకీయాలను పక్కన బెట్టి కొత్త భవనం నిర్మాణం పూర్తి చేస్తే అందరికీ బాగుంటుంది.

*- సురేశ్ గౌడ్, గ్రామస్తుడు, తర్నికల్*

### పిల్లలను పంపాలంటే భయమేస్తుంది..



నా కూతురు ప్రవళ్లిక ఈ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నది. పాఠశాల కూలిపోతుందనే భయంతో చాలామంది పిల్లలను వాళ్ల తల్లిదండ్రులు కల్వకుర్తికి పంపిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలంటే డబ్బులతో కూడిన వ్యవహారం కనుక నా బిడ్డను ప్రభుత్వ పాఠశాలకే పంపిస్తున్నా. ముసురు వర్షాలకు పాఠశాల పరిస్థితి మరీ దారుణంగా మారిపోయింది. వర్షం వల్ల తరగతి గదులు ఉసురుతున్నాయని నా బిడ్డ చెబుతుంటే భయం వేస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపించాలి. కొత్త బడి నిర్మించే వరకు మరో చోట తరగతులు నిర్వహించాలి.

*- బాలస్వామి, విద్యార్థిని తండ్రి, తర్నికల్*

### గోడల్లోకి దిగుతున్న వర్షపు నీరు..



ముసురు వర్షాలకు పాఠశాల పైకప్పుతోపాటు గోడలు పూర్తిగా తడిసిపోయాయి. ఏ గోడను ముట్టుకున్నా నీరు చేతులకు అంటుకుంటుంది. పైకప్పు నుంచి వర్షం బిందువులు కిందకు పడుతున్నాయి. గదులలో ముక్కిన వాసన వస్తుంది. పిల్లలను గదిలో బాగున్న కొద్ది చోట కూర్చోబెట్టుకొని చదువులు చెబుతున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించడానికి అయిష్టత వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పరిస్థితి గురించి మండల విద్యాధికారికి సమాచారం ఇచ్చాం.

*- విజయ్‌కుమార్, హెచ్‌ఎం, తర్నికల్ పాఠశాల*